పెన్ పవర్
10 YEAR ANNIVERSARY 2014 - 2024
తెలంగాణ రౌండప్
బుధవారం 26 ఫిబ్రవరి 2025 పేజీలు 8

## కలెక్టరేట్, ఆర్డీవో ఆఫీస్ స్వాధీనానికి నిర్మల్ కోర్టు ఆదేశాలు




హైదరాబాద్ పెన్ పవర్:నిర్మల్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సంచలన తీర్పు వెలువరించారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు(SRSP), గడ్డెన్న వాగు పరిహారం చెల్లింపు ల్లో జరుగుతున్న జాప్యంపై నిర్మల్ కలెక్టరేట్, ఆర్డీవో ఆఫీసులను స్వాధీనం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ తీర్పిచ్చారు. గడ్డెన్న వాగు, శ్రీరాంసాగర్ జలాశయంలో భూములు కోల్పోయిన బాధితులకు

- మిగతా 3లో...

# శివోహం

## నేడు మహాశివరాత్రి

- ముస్తాబైన శివాలయాలు
- ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- ఉపవాస దీక్షల్లో భక్తులు

శివరాత్రివేళ ఒక్కసారిగా పుణ్యనదులు, పుణ్యక్షేత్రాలు జనవాహినితో సందడిగా ఉంటాయి. ఒక సమైక్యతకీ, సమన్వయానికీ సంకేతమిది. భాషలు, ఆచార వ్యవహారాలు, కట్టూ బొట్టూ ఇలాంటి తేడాలు ఎన్ని ఉన్నా భారతీయులందరూ ఒకే శివభావంతో ఒక్కటిగా మసలే సుదినమిది. దేవదానవులు క్షీరసాగర మథనం చేసినప్పుడు ముందుగా పుట్టిన హాలాహలాన్ని ఉండలా చేసుకుని కంఠంలో ఉంచి కాపాడిన వాడు శివుడు. ఆ తరువాతపాలకడలిని మథించగా వచ్చిన అద్భుతమైన వస్తువులన్నింటినీ దేవదానవులే పంచుకున్నారు. అవేవీ శివుడు స్వీకరించలేదు. ఆశించలేదు. ఈ లీలద్వారా జగత్పాలకుడైన శివుడు,పాలకులు ఎలా ఉండాలో బోధించాడు.









హైదరాబాద్ పెన్ పవర్:మహాశివుడికి ఎంతో ఇష్టమైన రోజు మహా శివరాత్రి. అందుకే భక్తులు ఆ రోజంతా శివ నామాన్ని స్మరిస్తారు. రాత్రంతా జాగారం చేస్తారు. భోళా శంకరుడిని ప్రసన్నం చేసుకునేందుకు ఉపవాసం ఉంటారు. భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. అన్ని శైవ క్షేత్రాల్లో అంగరంగ వైభవంగా ఉత్సవాలు చేస్తారు. తెలంగాణలో ఎన్నో శైవ క్షేత్రాలు ఉన్నాయి. అందులో కొన్నింటి గురించి తెలుసుకుందాం.

-2లో

# ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలి

- బాధ్యులైన వారిపై విచారణ చేపట్టాలని కేటీఆర్ డిమాండ్
- సహాయక చర్యలను వేగవంతం చేయాలన్న కేటీఆర్
- మంత్రులు రాజకీయాలు మాట్లాడుతున్నారంటూ హరీశ్ రావు ఆగ్రహం



హైదరాబాద్ పెన్ పవర్:ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై జ్యుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సహాయక చర్యలను వేగవంతం చేస్తూనే, ఈ ప్రమాదానికి బాధ్యులైన వారిపై విచారణ చేపట్టాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వరుసగా పలు ప్రాజెక్టుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఇంతకుముందు సుంకిశాల, పెద్దవాగు ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు.

-3లో



## శివరాత్రి ఏర్పాట్లపై మంత్రి కొండా సురేఖ సమీక్ష, ఏర్పాట్లపై ఆదేశాలు

- ఆలయాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్న కొండా సురేఖ
- తాగునీటి వసతి, విద్యుద్దీపాల అలంకరణ వంటి ఏర్పాటు చేయాలన్న మంత్రి
- సమన్వయం కోసం ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్న మంత్రి

హైదరాబాద్ పెన్ పవర్:మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శైవాలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలంగాణ మంత్రి కొండా సురేఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శివరాత్రి సందర్భంగా ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేములవాడ, కాళేశ్వరం, కీసర, ఏడుపాయలు,

-2లో




## మార్చి 1న లక్ష రేషన్ కార్డులు..


### ఒక్క రోజే భారీ మొత్తంలో పంపిణీకి ఏర్పాట్లు

- హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో డిస్ట్రిబ్యూషన్
- మార్చి 8 తర్వాత మిగతా ప్రాంతాల్లో పంపిణీ!

-3లో



పదవీవిరమణ పొందిన నెల్లుట్ల సాధ్వీమణి, భర్త ప్రసాద్ రావు..




ఉపాధ్యాయురాలు సాధ్వీమణిని శాలువాతో సత్కరించిన మహబూబాబాద్ సీనియర్ జర్నలిస్టులు..

- ఉపాధ్యాయురాలు సాధ్వీమణి దంపతులను శాలువాతో సత్కరించిన ప్రముఖులు..
- బయ్యారం మండలంలో 34 ఏళ్ళుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ బోధించిన సాధ్వీమణి..
- చివరికి గంధంపెల్లి గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పాఠశాలలో పదవీవిరమణ..
- కన్నీటి పర్యంతమైన విద్యార్థిని విద్యార్థులు, ఉద్వేగానికి లోనైన టీచర్ సాధ్వీమణి..

# నెల్లుట్ల సాధ్వీమణి పదవీ విరమణ..

## వీడ్కోలు వేడుకను ఘనంగా నిర్వహించిన తోటి అధ్యాపక బృందం..



పదవీవిరమణకు హాజరైన ప్రముఖులు..



టీచర్ సాధ్వీమణి తోటి అధ్యాపక బృందం..

**మహబూబాబాద్, పెన్ పవర్, ఫిబ్రవరి 25:** ముప్పై నాలుగు ఏళ్ళు ఉపాధ్యాయురాలు వృత్తిలో రాణించి పలువురి మన్ననలు పొంది..! ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన ఆంగ్లభాషను భోదించే అధ్యాపకురాలి పదవీవిరమణ వేడుకను తోటి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో గత 34 సంవత్సరాలుగా ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ బోధించిన ఉపాధ్యాయురాలు సాధ్వీమణి వీడ్కోలు పార్టీలో ఘనంగా సన్మానించారు.. బయ్యారం మండలం గంధంపెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు నెల్లుట్ల సాధ్వీమణి పదవీవిరమణ వేడుకను ఘనంగా ఏర్పాటు చేశారు.. ఎంతోమంది విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన టీచర్ సాధ్వీమణి పలువురి మన్ననలు పొందారు.. సుదీర్ఘకాలం తమతో పనిచేసి పదవీవిరమణతో వీడ్కోలు పలుకుతూ, సహ ఉపాధ్యాయులు ఉద్వేగానికి లోనయ్యారు.. పేరెంట్స్ కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రముఖులు ఉపాధ్యాయురాలు సాధ్వీమణి ఆర్వి ప్రసాద్ రావులను శాలువాతో ఘనంగా సత్కరించారు.. ఇంగ్లీష్ టీచర్ పదవీవిరమణతో విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు.. ఆప్తమిత్రులు, సహోపాధ్యాయులు, విద్యార్థులు తమ జ్ఞాపకార్థంగా బహుమతులు అందజేశారు..ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విశ్రాంతి ఉపాధ్యాయులు, సీనియర్ జర్నలిస్టులు మాటేటి వేణు, మురళీ కృష్ణ, టియుడబ్ల్యుజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి శ్రీహరి, ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు ఉమ్మగాని మధు, తదితరులు పాల్గొన్నారు..

# శివరాత్రి ఏర్పాట్లపై మంత్రి కొండా సురేఖ సమీక్ష, ఏర్పాట్లపై ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

రామప్ప, పానగల్లు, పాలకుర్తి, వరంగల్ వేయి స్థంభాల గుడి, కాశిబుగ్గ శివాలయం, భద్రకాళి ఆలయం తదితర దేవాలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆయా దేవాలయాల్లోని ఏర్పాట్లపై అధికారులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం రుద్రాభిషేకం, సామూహిక బిల్వార్చన, రుద్ర హోమం, ప్రవచనాలతో పాటు క్యూలైన్ మేనేజ్‌మెంట్, తాగునీటి వసతి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, విద్యుత్ వసతి, వాహనాల పార్కింగ్, విద్యుద్దీపాల అలంకరణ, చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు వంటి వాటిని ఏర్పాటు చేయాలన్నారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాలను సమన్వయం చేయడానికి హైదరాబాద్‌లోని ఎండోమెంట్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోన్ని అన్ని దేవాలయాల్లో శివ రాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేలా జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి అన్నారు.

## ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలి

- మొదటి పేజీ తరువాయి

ఈ ప్రమాదాలకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి దర్యాప్తు చేయలేదని, బాధ్యులపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు చేయాలని కేటీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఇతర సంస్థల సహాయంతో సొరంగంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకురావాలని పేర్కొన్నారు.

**మంత్రులు రాజకీయాలు మాట్లాడుతున్నారు: హరీశ్ రావు**

ఎస్ఎల్‌బీసీలో చిక్కుకున్న 8 మంది సురక్షితంగా తిరిగి రావాలని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆకాంక్షించారు. సహాయక చర్యలకు వెళ్లిన మంత్రులు రాజకీయాలు మాట్లాడటం విడ్డూరమని అన్నారు. సహాయక చర్యలకు ఇబ్బందులు రాకూడదనే తాము ప్రమాదస్థలికి వెళ్లడం లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ఘటనలో వచ్చిన ఎన్డీఎస్ఏ ఇప్పుడు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగితే ఎందుకు రావడం లేదని నిలదీశారు.

## కలెక్టరేట్, ఆర్డీవో ఆఫీస్ స్వాధీనానికి నిర్మల్ కోర్టు ఆదేశాలు

- మొదటి పేజీ తరువాయి

పరిహారం చెల్లించా ల్సి ఉంది. బాధితులకు ఆ పరిహారం చెల్లించడంలో కలెక్టర్ ఆఫీస్, ఆర్డీవో కార్యాలయం అధికారులు జాప్యం చేస్తున్నారు. ఈ క్రమంలో బాధితులు కోర్టును ఆశ్రయించడంతో విచారించిన న్యాయస్థానం.. కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయం స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.

## మార్చి 1న లక్ష రేషన్ కార్డులు.. ఒక్క రోజే భారీ మొత్తంలో పంపిణీకి ఏర్పాట్లు

హైదరాబాద్ పెన్ పవర్: ఒక్క రోజే లక్ష రేషన్ కార్డులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. మార్చి 1వ తేదీన వీటిని పంపిణీ చేయనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్న జిల్లాల్లో వీటిని పంపిణీ చేయడం లేదు. ఆ రోజు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఉంటుంది. ఒకే రోజు లక్ష రేషన్ కార్డుల పంపిణీకి అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మిగతా జిల్లాల్లో మార్చి 8న అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తెలంగాణలో సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉండగా.. 2.81 కోట్ల మంది లబ్దిదారులున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త కార్డుల జారీ ప్రక్రియపై కసరత్తు చేస్తోంది. సుమారు 6 లక్షల వరకు కొత్త కార్డులు జారీ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతున్నది. ఇదిలా ఉండగా జనవరి 26న ఎంపిక చేసిన గ్రామాల్లో 16,900 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. కొత్తగా రంగారెడ్డి జిల్లాలో 24 వేలు, వికారాబాద్ జిల్లాలో 22 వేలు, నాగర్‌కర్నూల్‌లో 15 వేలు, గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 13 వేల చొప్పున, నారాయణపేట జిల్లాలో 12 వేలు, మేడ్చల్ మల్కాజిగిరి, వనపర్తి జిల్లాల్లో 6 వేల చొప్పున, హైదరాబాద్‌లో 285 మందికి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారు.

### హైదరాబాద్ లో పిల్లలను అమ్మే గుజరాత్ ముఠా గుట్టురట్టు :

# అక్కడ కిడ్నాప్ చేసి ఇక్కడ అమ్మకం




హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ లో చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాను అరెస్ట్ చేశారు పోలీసులు. జాయింట్ ఆపరేషన్ చేసిన మల్కాజ్గిరి ఎస్ఓటీ, చైతన్యపురి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పిల్లలను అమ్మినోళ్లతో పాటు కొనుగోలు చేసిన 11 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు పోలీసులు. నలుగురు సభ్యులు ఉన్న ముఠా అప్పుడే పుట్టిన పిల్లలను గుజరాత్ నుండి తీసుకొచ్చి ఏపీ, తెలంగాణలో అమ్ముతున్నట్లు గుర్తించామన్నారు పోలీసులు. ఈ ముఠా ఆడ శిశువును రూ. 2.5 లక్షలకు, మగ శిశువును రూ. 4.5 లక్షలకు విక్రయిస్తున్నారని.. పిల్లల్ని కొనుగోలు చేసిన దంపతులని సైతం నిందితులుగా చేర్చి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలు వందనతో కృష్ణవేణికి సోషల్ మీడియాలో పరిచయం అయ్యిందని.. గుజరాత్ నుండి పిల్లలను సప్లై చేసేందుకు వందనతో కృష్ణవేణి ఒప్పందం చేసుకుందని తెలిపారు పోలీసులు. గుజరాత్ నుండి తీసుకొచ్చిన పిల్లలను హైదరాబాద్, ఏపీలో అమ్ముతున్నట్లు గుర్తించామన్నారు. గుజరాత్ కి చెందిన వందన కృష్ణవేణి, దీప్తితో కలిసి ఈ దందా చేస్తున్నట్లు తెలిపారు పోలీసులు. అప్పుడే పుట్టిన పిల్లలను కిడ్నాప్ చేసి తీసుకొస్తున్నట్లు అనుమానిస్తున్నామని.. మూడు, నాలుగు రోజుల పిల్లల్ని వీళ్ళు టార్గెట్ గా చేసుకుంటున్నట్లు గుర్తించామని అన్నారు. గుజరాత్ నుండి పలువురు ఏజెంట్ల ద్వారా పిల్లలను హైదరాబాద్ కు తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు పోలీసులు. ఈ ముఠా నుండి పిల్లలను ఎన్ఆర్ఐ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకట్ పవన్, భార్య రమ శ్రావణి కొనుగోలు చేశారని అన్నారు పోలీసులు.

**ఇద్దరు దంపతులు అరెస్ట్:**

ఈ ముఠా నుండి శిశువును కొనుగోలు చేసిన దంపతులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు పోలీసులు. మూడు నాలుగు రోజుల వయసున్న పిల్లలను గుజరాత్ నుండి హైదరాబాదుకి వివిధ మార్గాల ద్వారా తరలిస్తున్నారని.. ఫేక్ డాక్యుమెంట్లు, ఫేక్ ఆధార్ కార్డులు ,ఫేక్ బర్త్ సర్టిఫికెట్లు సృష్టించి లక్షల రూపాయలకు అమ్మకాలు చేస్తున్నారని అన్నారు పోలీసులు. ఇందులో కీలక నిందితురాలుగా ఉన్న కృష్ణవేణిపై గతంలో గోపాలపురం పోలీస్ స్టేషన్లో కేసు నమోదయ్యిందని.. గతంలో కూడా ఇలాగే పిల్లల అమ్మకాలు చేస్తూ పోలీసులకు పట్టుబడిందని అన్నారు పోలీసులు. పిల్లని అడాప్ట్ చేసుకోవాలంటే చట్ట ప్రకారమే వెళ్లాలని.. చట్టాన్ని ఉల్లంఘించి అడ్డదారుల్లో పిల్లలను కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు పోలీసులు.

# శివోహం.. నేడు మహాశివరాత్రి

**కొమురవెల్లి మల్లన్న**

ఈ క్షేత్రం సిద్దిపేట జిల్లాలో ఉంది. ఇక్కడ శివరాత్రి రోజు వైభవంగా ఉత్సవాలు చేస్తారు. ఈ ఆలయంలోని మల్లికార్జునస్వామి విగ్రహాన్ని 'పుట్టమన్ను'తో చేశారు. అది కూడా 500 సంవత్సరాల క్రితం. అయినా నేటికీ చెక్కుచెదరలేదు. అంతేకాదు స్వామి విగ్రహంలో నాభి వద్ద 'పుట్టు లింగం' ఉందని భక్తులు చెప్తుంటారు. యాదవుల ఆడపడచు 'గొల్ల కేతమ్మ'ను, లింగ బలిజల ఆడపడచు 'బలిజ మేడమ్మ'ను మల్లన్నస్వామి పెళ్లి చేసుకున్నారు. అందుకే స్వామికి రెండు వైపులా.. గొల్ల కేతమ్మ, బలిజ మేడమ్మ విగ్రహాలు ప్రతిష్ఠించారు' అని భక్తులు చెప్తుంటారు. ఇక్కడ ఏటా సంక్రాంతితో మొదలయ్యే ఉత్సవాలు ఉగాది వరకూ సాగుతాయి. అందులో భాగంగా నిర్వహించే 'పట్నంవారం' ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. ఆలయంలో శివరాత్రి రోజు ప్రత్యేక పూజలు జరుగుతాయి. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తుతారు.

**కీసర గుట్ట**

ఇది హైదరాబాదుకు ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ రామలింగేశ్వర స్వామి భవానీసమేతుడై కొలువుదీరాడు. ఈ క్షేత్రం గురించి ఒక కథ ప్రచారంలో ఉంది. 'శ్రీరాముడు, సీత, ఆంజనేయుడు పరవశించి పోయి శివలింగాన్ని ప్రతిష్ఠించాలి అనుకున్నారు. అందుకోసం శ్రీరాముడు వారణాసి నుంచి లింగాన్ని తీసుకురమ్మని ఆంజనేయుడికి చెప్పాడు. అయితే ఆంజనేయుడు సరైన లింగాన్ని ఎంచుకోలేక 101 శివ లింగాలను తీసుకొచ్చాడు. కానీ అప్పటికే ముహూర్తం మించిపోవడంతో స్వయంగా శివుడే ప్రత్యక్షమై లింగాన్ని రాముడికి ఇచ్చాడు. హనుమంతుడు వచ్చే సరికి లింగ ప్రతిష్ఠ పూర్తయింది. తాను తెచ్చిన లింగాలను ప్రతిష్ఠించలేదనే కోపంతో లింగాలన్నింటినీ విసిరివేశాడు ఆంజనేయుడు. దాంతో కీసర గుట్ట పరిసరాల్లో లింగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి' అని చెప్తున్నారు భక్తులు. అందుకే ఇప్పటికీ ఈ ప్రాంతంలో చాలా శివ లింగాలు కనిపిస్తుంటాయి.

**కాళేశ్వరం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉంది. దేశంలో ఎక్కడాలేని విధంగా ఒకే పానవట్టంపై రెండు లింగాలు ఉండటం కాళేశ్వరాలయం ప్రత్యేకత. పురాణాల్లో కూడా ఈ క్షేత్ర ప్రస్తావన ఉంది. ఆలయంలో మొదట కాళేశ్వరుడిని(యముడు) పూజించి తర్వాత ముక్తేశ్వరుడిని (శివుడు) పూజిస్తే స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. 'ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులందరికీ స్వామి ముక్తిని ప్రసాదించడంతో అందరి పాపాలు తొలగిపోయి యముడికి పని లేకుండా పోయిందట. దాంతో యముడు శివుడితో మొరపెట్టుకుంటాడు. అప్పుడు శివుడు యముడిని కూడా లింగాకారంలో తన పక్కనే కొలువుదీరమని చెప్పాడు. లింగాకారంలో ఉన్నయముడిని పూజించకుండా వెళ్లేవాళ్లకు ముక్తి దొరకదు. అలాంటి వాళ్లను యముడు నరకానికి తీసుకుపోవచ్చని శివుడు చెప్పాడ'ని భక్తులు చెప్తుంటారు. మరో విశేషం ఏంటంటే.. ఇక్కడి లింగంలో రెండు రంధ్రాలుంటాయి. వీటిలో నీటిని పోస్తే ఆలయానికి దగ్గరలో ఉన్న గోదావరి, ప్రాణహిత సంగమంలో కలుస్తాయట.

**వేములవాడ రాజన్న**

తెలంగాణలో ఎంతో పేరుగాంచిన శైవక్షేత్రం. రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఉంది. ఇక్కడ శివుడు శ్రీరాజరాజేశ్వరుడిగా కొలువుదీరాడు. 'వృత్రాసురుని చంపిన ఇంద్రుడుబ్ర హ్మహత్యాదోషాన్నినివారించుకునేందుకు అనేక పుణ్యక్షేత్రాలను దర్శించాడు. అయినా ఆయనకు దోష నివారణ కాకపోవడంతో బృహస్పతి సూచనతో రాజేశ్వరక్షేత్రాన్ని దర్శించుకున్నాడు. దాంతో వెంటనే దోష నివారణ జరిగింద'ని భక్తులు చెప్తుంటారు. వేములవాడలో రాజరాజేశ్వరీ అమ్మవారి, కాశీ విశ్వేశ్వర, కోదండ రామ, ఉమా మహేశ్వర, బాలా త్రిపురసుందరీ దేవి, బాల రాజేశ్వర, విఠలేశ్వర, సోమేశ్వర, భీమేశ్వర, కనకదుర్గ, మహాలక్ష్మి ఆలయాలు, బద్ది పోచమ్మ ఆలయాలు కూడా ఉన్నాయి.

## అద్భుతం తల్లీ అద్భుతం : వీడియో కాల్ ఫోన్ కు కుంభమేళాలో పవిత్ర స్నానం




**హైదరాబాద్ పెన్ పవర్:**ఈ ఐడియా అద్భుతం.. మహా అద్భుతం.. ఐడియాలకు ఇండియాలో కొదవ లేని నిరూపిస్తున్నారు జనం. కుంభమేళాలో పవిత్ర స్నానం చేయటం కామన్.. అక్కడికి వెళ్లలేని వాళ్లు తమ ఫొటోలను పంపి.. ఆ ఫొటోలను త్రివేణి సంగమంలో ముంచి పునీతులను చేస్తున్నారు మరికొందరు. ఇది నిన్నా మొన్నటి వరకు జరిగింది.. ఇప్పుడు ట్రెండ్ మారింది. కుంభమేళా ముగింపు దశలో.. వీడియో కాల్ సమయంలో.. సెల్ ఫోన్ ను నదిలో ముంచి.. పవిత్ర స్నానం చేయించిన మహిళ ఘటన ఇప్పుడు ఔరా అనిపిస్తోంది. దేశం అవాక్కయ్యేలా ఈ ఐడియా ఎలా వచ్చిందీ అంటూ నెటిజన్లు ఫన్నీ ఫన్నీగా రియాక్ట్ అవుతున్నారు.ఓ మహిళ కుంభమేళాలో పవిత్ర స్నానం చేస్తుండగా.. తన భర్తకు వీడియో కాల్ చేసి, ఆ ఫోన్ కు కూడా నదిలో స్నానం చేయించింది. ఇందుకు సంబంధించిన వీడియోను ఓ నెటిజన్ ఇంస్టాగ్రామ్ లో షేర్ చేయగా.. అది కాస్తా వైరల్ గా మారింది. గోపి బహు ఇన్ ప్రయాగ్ రాజ్ అన్న క్యాప్షన్ తో షేర్ చేసిన ఈ వీడియోకి మీమ్ కంటెంట్ తో కామెంట్ చేస్తున్నారు నెటిజన్స్.నెట్టింట తెగ వైరల్ అవుతున్న ఈ వీడియోకి పోస్ట్ చేసిన 7గంటల్లోనే మంగళవారం ( ఫిబ్రవరి 25 ) సాయంత్రానికి 72వేల వ్యూస్ తో చక్కర్లు కొడుతోంది.

## విద్యార్థులకు అలర్ట్! ఈఏపీ సెట్ దరఖాస్తుల స్వీకరణ వాయిదా




**హైదరాబాద్ పెన్ పవర్:**ఇంటర్ విద్యార్థులకు అలర్ట్! ఈరోజు సాయంత్రం ప్రారంభం కావాల్సిన ఈఏపీ సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వాయిదా పడింది. ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఈఏపీ సెట్ దరఖాస్తుల స్వీకరణ ఈరోజు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ వాయిదా పడినట్లు ఈఏపీ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మార్చి 1వ తేదీన ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఇటీవల ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నేడు సాయంత్రం 4.45 గంటల నుండి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కావాల్సింది. దరఖాస్తుల స్వీకరణ మార్చి 1న ప్రారంభమవుతుందని, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల నేపథ్యంలో విద్యార్థుల సందేహాల నివృత్తికి జేఎన్టీయూ రెండు హెల్ప్ లైన్‌లను ఏర్పాటు చేసింది. 7416923578 లేదా 7416908215 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# రూ.90 కోట్లు ఖర్చు పెట్టించారన్న కాంగ్రెస్ నేత చిన్నారెడ్డి వీడియోను ట్వీట్ చేసిన హరీశ్ రావు

**హైదరాబాద్ పెన్ పవర్:**మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి చేత రూ.90 కోట్లు ఖర్చుపెట్టించారని చిన్నారెడ్డి చెప్పాడని బీఆర్ఎస్ నేత, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఈ మేరకు చిన్నారెడ్డి మాట్లాడిన వీడియో క్లిప్‌ను 'ఎక్స్' వేదికగా జత చేశారు. ఓట్లను కొనుగోలు చేసే క్రమంలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు రూ.5 లక్షల నుండి రూ.10 లక్షల వరకు ఇస్తామని హామీ ఇచ్చి, రెండున్నర లక్షల రూపాయలు మాత్రమే ఇచ్చారని చిన్నారెడ్డి బట్టబయలు చేశారని పేర్కొన్నారు.

ఈ విషయంపై ఈడీ, సీబీఐ, ఐటీ, ఎన్నికల కమిషన్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. సుమోటోగా తీసుకొని కేసులు ఎందుకు పెట్టడం లేదో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ నాయకులపై నిరాధారమైన కేసులు పెట్టటంలో చూపించే అత్యుత్సాహం ఈ విషయంలో ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. ఆధారాలు ఉన్నప్పటికీ, స్వయంగా కేబినెట్ ర్యాంకులో ఉండి, ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్





నాయకుడే ఇంత మొత్తంలో ఖర్చు చేసినట్లు చెబుతుంటే కేసులు ఎందుకు పెట్టడం లేదో చెప్పాలన్నారు.కాంగ్రెస్ మార్కు ప్రజా పాలన, రాజ్యాంగ పరిరక్షణ అంటే ఇదేనా? రాజ్యాంగం చేతిలో పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ దీనిని ఏ విధంగా సమర్థిస్తారు? ఏం సమాధానం చెబుతారు? బడే భాయ్, ఛోటే భాయ్ బంధానికి ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలి? బీజేపీ, కాంగ్రెస్ చీకటి ఒప్పందానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. వెంటనే కేసులు పెట్టి, విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

# 299 మంది రోగులపై అత్యాచారం చేసిన సర్జన్.. ఫ్రాన్స్ లో దారుణం

### నలుగురు రోగులపై అఘాయిత్యం కేసులో అరెస్ట్

### విచారణలో నిందితుడి ఆకృత్యాలు వెలుగులోకి..

### ఇంట్లో 3 లక్షలకు పైగా అసభ్య ఫొటోలు, 650 వీడియోలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫ్రాన్స్ లో ఓ వైద్యుడు అత్యంత నీచమైన చర్యకు పాల్పడ్డాడు. అనారోగ్యంతో చికిత్స కోసం వచ్చిన రోగులపై అత్యాచారం చేశాడు. ఏళ్ల తరబడి సాగిన ఈ దారుణం ఇటీవల బయటపడింది. ఓ చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని విచారించగా, తాను చేసిన దారుణాలను ఆ వైద్యుడు వెల్లడించాడు. 1989 నుంచి 2004 వరకు 299 మందిపై అఘాయిత్యం చేసినట్లు అంగీకరించాడు. బాధితులలో ఎక్కువమంది చిన్నపిల్లలేనని, బాలికలతో పాటు బాలురపైనా దారుణాలకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. నిందితుడి బాధితులలో 158 మంది అబ్బాయిలు, 141 మంది అమ్మాయిలు ఉన్నారని చెప్పారు. అందులో కొంతమందికి తమపై అత్యాచారం జరిగిన విషయమే తెలియదని, పోలీసులు వెలుగులోకి తెచ్చిన నిందితుడి డైరీ ఆధారంగా వారు తెలుసుకున్నారని వివరించారు. బ్రిటానీ అనే ప్రాంతంలో 74 ఏళ్ల జోయెల్ లి స్కార్నెక్ ఓ ఆసుపత్రిలో సర్జన్ గా పనిచేసేవాడు. తన వద్దకు చికిత్స కోసం వచ్చే రోగులపై జోయెల్ అఘాయిత్యం చేసేవాడు. వారిని



మత్తులోకి పంపాక అత్యాచారం చేసేవాడు. దాదాపు 30 ఏళ్లపాటు ఈ దారుణాలకు పాల్పడ్డాడు. అయితే, 2017లో పొరుగింట్లో ఉంటున్న ఓ ఆరేళ్ల చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించాడు. పాప తల్లిదండ్రులు కేసు పెట్టడంతో పోలీసులు జోయెల్ ను అరెస్టు చేశారు. విచారణలో నలుగురు చిన్నారులపై అత్యాచారం చేసినట్లు గుర్తించిన పోలీసులు సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో 2020లో కోర్టు జోయెల్ కు 15 ఏళ్ల శిక్ష విధించింది. ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేయగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయని పోలీసులు తెలిపారు. నిందితుడు జోయెల్ ఇంట్లో 3 లక్షలకు పైగా అసభ్య ఫొటోలు బయటపడ్డాయి. 650లకు పైగా అశ్లీల వీడియోలను గుర్తించినట్లు వివరించారు. లైంగిక దాడి జరిపిన బాధితుల వివరాలతో నిందితుడు ఓ డైరీని నిర్వహించినట్టు తెలిపారు. తాజాగా లభించిన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టామని తెలిపారు. చికిత్స కోసం తన దగ్గరికి వచ్చిన చిన్నారులపై అఘాయిత్యానికి పాల్పడినట్లు కోర్టులో జోయెల్ అంగీకరించాడు. ప్రస్తుతం ఈ కేసు విచారణ జరుగుతోందని, దోషిగా నిర్ధారణ అయితే జోయెల్ కు మరో 20 ఏళ్లు శిక్ష పడే అవకాశం ఉందని పోలీసులు వివరించారు.

# ఆ గోధుమలతోనే బట్టతల సమస్య!


హైదరాబాద్ పెన్ పవర్:జుట్టు ఒత్తుగా ఉండాలని కోరుకోనివారెవరూ ఉండరు. కానీ ఎలాంటి కారణం లేకుండా ఉన్నట్టుండి జుట్టు రాలిపోతే...? దానికి మనం రోజూ తినే సాధారణ ఆహారమే కారణమమైతే? చాలా చిత్రమైన సమస్య కదా...! మహారాష్ట్రలో ఇటీవల ఇదే సమస్య తలెత్తింది. ఆ సమస్యకు గోధుమలు కారణ మని తాజాగా తేలింది. ఆ విశేషాలు ఏమిటంటే...

**చిన్నా, పెద్దా అందరికీ సమస్య..**

అది మహారాష్ట్రలోని బుల్దానా జిల్లా. ఆ జిల్లాలో గత ఏడాది డిసెంబర్ లో ఒక్కసారిగా కలకలం మొదలైంది. దానికి కారణం... ఆడా, మగా, పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరికీ జుట్టు ఊడిపోతూ... బట్టతలలా మారిపోతుండటమే. సమస్య ఏమిటో అర్థంకాక, పీక్కోవడానికి జుట్టూ లేక చాలా మంది తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

ఈ జిల్లాలోని సుమారు 18 గ్రామాల్లోని 279 మందిలో అకస్మాత్తుగా వెంట్రుకలు రాలిపోయే 'ఆక్యూట్ ఆన్ సెట్ అలోపేసియా టోటాలిస్' సమస్య వచ్చింది. ఇది జాతీయ స్థాయిలో చర్చనీయాంశం కావడంతో పరిశోధకులు దీనిపై దృష్టి సారించారు. జుట్టు ఎందుకు





రాలిపోతోందన్న దానిపై అధ్యయనం చేసి... అసలు సంగతి తేల్చారు.

**సెలీనియం ఎక్కువున్న గోధుమలే..**

బుల్దానా జిల్లాలో అకస్మాత్తుగా జుట్టు రాలడం సమస్యకు కారణం సెలీనియం ఎక్కువగా ఉన్న గోధుమలేనని వైద్య నిపుణులు తేల్చారు. పంజాబ్, హర్యానాలలోని కొన్ని ప్రాంతాల్లో పండిన గోధుమలలో అధిక సెలీనియం ఉండటం, ఆ గోధుమలను విరివిగా వినియోగించడమే దీనికి కారణమని గుర్తించారు. బాధితుల తల వెంట్రుకలు, రక్త నమూనాలను సేకరించి ఈ అధ్యయనం చేశారు.

**ఏమిటీ సెలీనియం?**

సెలీనియం అనేది ఖనిజ పదార్థం. ఇది సహజంగా నీటితో పాటు కొన్ని ఆహార పదార్థాల్లో లభిస్తుంది. నిజానికి మన శరీరంలో కొన్ని రకాల జీవక్రియలకు సెలీనియం అత్యంత అవసరం. కానీ మోతాదుకు మించితే మాత్రం సమస్యలకు దారితీస్తుంది. అందులో ఒకటి... జుట్టు రాలిపోయే సమస్య. అంతేకాదు సెలీనియం మోతాదు ఎక్కువైతే తలనొప్పి, జ్వరం, దురద, వాంతులు, విరేచనాల వంటి సమస్యలు కూడా ఎదురవుతాయి. మహారాష్ట్రలో బాధితులలో కూడా ఈ లక్షణాలు కనిపించడం గమనార్హం.

**గోధుమలు మార్చేస్తే సమస్య తగ్గి...**

బాధితులు తిన్న గోధుమల్లో సాధారణం కంటే 600 రెట్లు ఎక్కువగా సెలీనియం ఉన్నట్లు గుర్తించామని వైద్య నిపుణులు తెలిపారు. దీనితో బాధితులకు ఈ తరహా గోధుమలను వినియోగించవద్దని సూచించామని... దానితో చాలా మందిలో జుట్టు రాలే సమస్య తగ్గిపోయిందని వివరించారు.

## ఈ ఏడు జిల్లాల్లో వైన్స్ బంద్.. 3 రోజులు మందు దొరకదు..




హైదరాబాద్ పెన్ పవర్: ఫిబ్రవరి 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న కారణంగా తెలంగాణలోని ఏడు జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఇవాళ సాయంత్రం (మంగళవారం, ఫిబ్రవరి 25) 4 గంటల నుంచి మద్యం అమ్మకాలు బంద్ అయ్యాయి. వైన్స్, బార్లు మూతబడ్డాయి. మళ్లీ.. గురువారం సాయం త్రం 4 గంటల తర్వాతే ఈ ఏడు జిల్లాల్లో వైన్ షాపులు, బార్లు తెరుచుకునేందుకు అనుమతి ఉంది.రాష్ట్రంలో మూడు స్థానాలకు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పర్వం ఇప్పటికే ముగిసింది. మంగళవారం సాయంత్రంతో ప్రచారానికి తెరపడింది. నాలుగు వారాల పాటు జోరుగా సాగిన ప్రచారం.. అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని తలపించింది. ఉమ్మడి కరీంనగర్ %-% నిజామాబాద్%-% ఆదిలాబాద్ %-% మెదక్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది, అదే సెగ్మెంట్ నుంచి గ్రాడ్యుయేట్ స్థానానికి 56 మంది పోటీ పడుతుండగా, నల్గొండ ఖమ్మం%-%వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి 19 మంది బరిలో నిలిచారు. నెల రోజులుగా ప్రధాన అభ్యర్థులు తీవ్రంగా ప్రచారం నిర్వహించారు.బీజేపీ మూడు స్థానాలకు పోటీ పడుతున్నది. దీంతో ఆ పార్టీకి చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అన్నీ తామై ప్రచారాన్ని సాగించారు. కరీంనగర్ గ్రాడ్యుయేట్ స్థానానికే పరిమి తమైన కాంగ్రెస్ కూడా తీవ్రంగానే ప్రచారం చేసింది. చివరికి సీఎం రేవంత్ రెడ్డి కూడా రంగంలోకి దిగారు. బీఆర్ఎస్ అధికారికంగా అభ్యర్థుల ను నిలపలేదు. మరోపక్క పీఆర్టీయూ, యూటీఎఫ్, టీపీటీఎఫ్, సీపీఎస్ఈయూ, జాక్టో, ఎస్టీటీయూ తదితర టీచర్ల సంఘాలూ తమ అభ్యర్థులు బరిలో దింపి జోరుగానే ప్రచారాన్ని సాగించాయి.

## రెడ్డి సామాజిక వర్గాన్ని దూషించినట్లు తప్పుడు ప్రచారం జరుగుతోంది: అంజన్ కుమార్ యాదవ్



హైదరాబాద్ పెన్ పవర్:యాదవ కుల సంఘం సమావేశంలో తాను రెడ్డి సామాజిక వర్గాన్ని దూషించినట్లుగా తప్పుడు ప్రచారం జరుగుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ అన్నారు. తాను అనని మాటలను అన్నట్లుగా కొంతమంది బీఆర్ఎస్ నాయకులు, వారి మీడియా ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. 'తెలంగాణను అడ్డుకున్నది కాంగ్రెస్ రెడ్లు' అని తాను అన్నట్లుగా 'నమస్తే తెలంగాణ'లో ప్రచురించారని మండిపడ్డారు.తనపై జరుగుతోన్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నానని అంజన్ కుమార్ యాదవ్ అన్నారు. ఇలాంటి దుష్ప్రచారాన్ని తెలంగాణ సమాజం నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అసత్య ప్రచారం చేసే వారిని సామాజిక బహిష్కరణ చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. తన స్నేహితుల్లోనూ చాలామంది రెడ్లు ఉన్నారని, ఒక సామాజిక వర్గాన్ని దూషించే వ్యక్తిత్వం తనది కాదని ఆయన అన్నారు.

పార్టీలోని రెడ్లతో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే తమ అందరి లక్ష్యమని చెప్పారు. కులగణనకు మద్దతుగా మాట్లాడిన తన మాటలను వక్రీకరించి అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో కులగణన చేశామని మాజీ ఎంపీ అన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టామని తెలిపారు.

కులగణన కార్యక్రమాన్ని స్వాగతించడంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను యాదవ కుల సంఘం సమావేశంలో కొనియాడినట్లు చెప్పారు. నిన్న జరిగిన యాదవ కుల సంఘం సమావేశంలో అంజన్ కుమార్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఒక సామాజిక వర్గం నేతలు యాదవులను ఎదగనీయకుండా చేస్తున్నారని, పార్టీలో తమ సామాజిక వర్గానికి ప్రాధాన్యత లేకుంటే ఊరుకునేది లేదని అంజన్ కుమార్ యాదవ్ అన్నట్లుగా వార్తలు వచ్చాయి. ఆ వార్తలపై ఆయన ఈరోజు స్పందించారు.

పెన్ పవర్

26 బుధవారం, ఫిబ్రవరి 2025

# నలుగురు మంత్రుల పర్యవేక్షణలో కొనసాగుతున్న ఎస్ఎల్ బీసీ టన్నెల్ సహాయక చర్యలు




**హైదరాబాద్ పెన్ పవర్:**నాగర్ కర్నూలు జిల్లా దోమలపెంట వద్ద ఎస్ఎల్బీసీ ఎడమవైపు టన్నెల్ పనుల్లో ప్రమాదం జరగడం తెలిసిందే. ఈ నెల 22న ఉదయం టన్నెల్ పనులు జరుగుతుండగా, ఒక్కసారిగా సొరంగం పైకప్పు కూలిపోయి, 8 మంది అందులోనే చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగి మూడ్రోజులు కావడంతో టన్నెల్ లో చిక్కుకున్న వారి పరిస్థితి పట్ల తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రస్తుతం ఘటన స్థలి వద్ద నలుగురు మంత్రుల పర్యవేక్షణలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి టన్నెల్ వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. కాగా, రెస్క్యూ టీమ్ లు 13.7 కి.మీ వరకు చేరుకున్నాయి. టన్నెల్ 10.95 కి.మీ వద్ద ఒకటిన్నర అడుగు నీరు నిలిచి ఉన్నట్టు గుర్తించారు. 11.9 కి.మీ వద్ద రెండు అడుగుల మేర నీటి ప్రవాహం ఉన్నట్టు గుర్తించారు. 13వ కి.మీ వద్ద టన్నెల్ బోరింగ్ మెషీన్ వెనుక పరికరాలు దెబ్బతిన్నాయి. బోరింగ్ మెషీన్ వెనుకభాగంలో బురద పేరుకుపోవడంతో కన్వేయర్ బెల్ట్ పనిచేయడంలేదు. 14వ కిలోమీటరు మరో 100 మీటర్ల దూరంలో ఉందనగా.... 6 అడుగుల ఎత్తులో మట్టి, రాళ్లతో పూడిక ఉండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలిగింది. టన్నెల్ లో చిక్కుకుపోయిన 8 మంది 14వ కిలోమీటరు వద్దే ఉంటారని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎండోస్కోపిక్ రోబోటిక్ పుష్ కెమెరాలు తీసుకెళ్లినా, పూడిక కారణంగా ప్రయోజనం కనిపించలేదు. బోరింగ్ మెషిన్ దెబ్బతినడంతో పుష్ కెమెరా టీమ్ లు ముందుకెళ్లలేక ఆగిపోయాయి.

# బీఆర్ఎస్ లో మంత్రి పదవులు అమ్ముకున్నారు

**మెదక్:పెన్ పవర్:** నర్సాపూర్ లో కాంగ్రెస్ నేతలు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఏఐసిసి సెక్రటరీ విష్ణునాథ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు,, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, నీలం మధు తదితరులు పాల్గొన్నారు.

విష్ణునాథ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పని అయిపోయిందని చెప్పడానికి ఈ ఎన్నికలే నిదర్శనం. బలమైన నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత ఉన్న చోట ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను ఎందుకు పెట్టలేదు. బీజేపీని గెలిపించడానికే ఇక్కడ అభ్యర్థిని పెట్టలేదు. ప్రజలు బీఆర్ఎప్ చేసే పనులన్నీ గమనిస్తున్నారు. పదేళ్ళలో కేసీఆర్ ఇవ్వలేని ఉద్యోగాలు ఏడాదిలోనే రేవంత్ రెడ్డి ఇచ్చారని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ కేసీఆర్ ప్రజలను కులాలుగా విభజించి రాజకీయాలు చేశాడు. బీసీల కులగణన చేయడం మంచిది.. చాలా మంది వెనుకబడి ఉన్నారు. కానీ బీసీల్లో కులాలుగా విడిపోకుండా బీసీలందరు ఒక్కటై ఉండాలి. ఎంపీ ఎన్నికల్లో నీలం మధు ముదిరాజ్ పేరుతో ప్రచారం చేసుకుంటే మిగతా బీసీ కులాలు ఓటేయకుంటే ఓడిపోయారు. బీఆర్ఎస్ లో మంత్రి పదవులు అమ్ముకున్నారు. కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవులు అమ్మకానికి పెడితే ఫస్ట్ మల్లారెడ్డి మంత్రి అయ్యేవాడని అన్నారు.

# హైదరాబాద్ జూపార్క్‌లో పెరగనున్న ధరలు

- ఏప్రిల్ 1వ తేదీ నుండి అమల్లోకి కొత్త ధరలు
- జూపార్కు ప్రవేశ రుసుము పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.40గా నిర్ణయం
- కమర్షియల్ మూవీ చిత్రీకరణకు రూ.10 వేలు వసూలు




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్‌లోని నెహ్రూ జంతు ప్రదర్శనశాలలో టిక్కెట్ ధరలు పెరగనున్నాయి. ఈ మేరకు పార్కులో జరిగిన జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ 13వ గవర్నరింగ్ బాడీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. పెరిగిన ధరలు ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వస్తాయని నెహ్రూ జూపార్క్ క్యురేటర్ జె.వసంత ఈరోజు ఒక ప్రకటనలో వెల్లడించారు.ఇకపై జూపార్కు సందర్శనకు ప్రవేశ రుసుము పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.40 చొప్పున వసూలు చేయనున్నారు. ఫొటో కెమెరాకు అనుమతి ఇస్తే రూ.150, వీడియో కెమెరా రూ.2,500, సినిమా చిత్రీకరణ కోసం రూ.10 వేలు ఛార్జీని వసూలు చేయనున్నారు.

జూపార్కులో రైలు ప్రయాణానికి పెద్దలకైతే రూ.80, పిల్లలకైతే రూ.40గా నిర్ణయించారు. బ్యాటరీ ఆపరేటెడ్ వాహనం ఎక్కితే పెద్దలకు రూ.120, పిల్లలకు రూ.70 చొప్పున నిర్ణయించారు. సఫారీ పార్కు డ్రైవ్ సీఎన్జీ బస్సు 20 నిమిషాలకు ఏసీ అయితే రూ.150, నాన్-ఏసీ అయితే రూ.100 చొప్పున వసూలు చేయనున్నారు. 11 సీట్లు కలిగిన కొత్త బ్యాటరీ ఆపరేటెడ్ వాహనం 60 నిమిషాలకు రూ.3,300, 14 సీట్ల బీవోవీ ఎక్స్‌క్లూజివ్ వాహనం అయితే రూ.4,000 వసూలు చేయనున్నారు.వాహనాల పార్కింగ్ విషయానికి వస్తే సైకిల్‌కు రూ.10, ద్విచక్ర వాహనం రూ.30, ఆటో రూ.80, కారు లేదా జీపు అయితే రూ.100, టెంపో లేదా తూఫాన్ అయితే రూ.150, 21 సీట్లు కలిగిన మినీ బస్సు రూ.200, 21 సీట్లు కలిగిన బస్సుకు రూ.300 చొప్పున ధరను నిర్ణయించారు.

# ఆ గ్రహశకలంతో మనకు ముప్పులేదట!

- భూమిని ఢీ కొట్టే అవకాశం దాదాపు శూన్యమే అంటున్న ఈఎస్ఏ
- 2024 వైఆర్ 4 గ్రహశకలం కదలికలను పరిశీలించిన స్పేస్ ఏజెన్సీ
- తొలుత ముప్పు ఎక్కువని చెప్పిన నాసా.. తాజాగా హెచ్చరికలు వాపస్




**హైదరాబాద్ పెన్ పవర్:**అంతరిక్షంలో సూర్యుడి చుట్టూ అత్యంత వేగంగా తిరుగుతున్న ఓ గ్రహశకలం 2032లో భూమిని ఢీకొట్టే అవకాశం ఉందని అంతరిక్ష పరిశోధనా సంస్థ నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) ఇటీవల హెచ్చరించిన విషయం తెలిసిందే. 2024 డిసెంబర్ 27న ఈ గ్రహశకలాన్ని చిలీ పరిశోధకులు గుర్తించారు. సూర్యుడి చుట్టూ దీర్ఘ వృత్తాకార కక్ష్యలో తిరుగుతున్న ఈ గ్రహశకలం వేగంగా భూమివైపు దూసుకొస్తోందని తెలిపారు. ఈ నెల 18న నాసా జరిపిన పరిశీలనలో 2024 వైఆర్ 4 గ్రహశకలం భూమిని ఢీ కొట్టేందుకు 3.1 శాతం అవకాశం ఉందని తేలింది. దీంతో ఈ గ్రహశకలాన్ని లెవెల్ -3 శకలంగా నాసా ప్రకటించింది. అయితే, ఈ గ్రహశకలంతో ఎలాంటి ముప్పు లేదని ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ) నిర్ధారించింది.

ఈ నెల 19న జరిపిన పరిశోధనలో ముప్పు శాతం 1.5 శాతంగా తేలిందని, ఈ నెల 24న జరిపిన పరిశోధనలో ముప్పు శాతం 0.002 శాతానికి తగ్గిందని నాసా కూడా వెల్లడించింది. దీంతో ఈ గ్రహశకలంతో భూమికి ముప్పు లేదని తేల్చి హెచ్చరికలను ఉపసంహరించుకుంది. అయితే, ఈ గ్రహశకలంపై నిఘా కొనసాగిస్తామని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. దీని పరిమాణం, లోపలి మూలకాల వివరాల గురించి పరిశోధన జరుపుతామని చెప్పారు. జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోపుతో ఈ గ్రహశకలాన్ని మార్చి, మే నెలల్లో పరిశీలించనున్నట్లు తెలిపారు. 2024 వైఆర్ 4 వ్యాసం సుమారు 50 మీటర్లు ఉండవచ్చని నాసా శాస్త్రవేత్తలు అంచనా వేశారు. కాగా, సూర్యుడి చుట్టూ దీర్ఘ వృత్తాకార కక్ష్యలో తిరగడం వల్ల ఈ గ్రహశకలం కొన్నాళ్లపాటు కనిపించదని, 2028 జూన్ లో మళ్లీ కనిపిస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

# ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ



**హైదరాబాద్, ఫిబ్రవరి 25, పెన్ పవర్:**బయో ఏషియా సమ్మిట్ హైదరాబాద్ ను ప్రపంచ లైఫ్ సైన్సెస్ రాజధానిగా నిలబెట్టిందని, హెల్త్ కేర్ రంగం భవిష్యత్తును నిర్దేశిస్తుందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దీమా వ్యక్తం చేశారు. ప్రపంచానికి మార్గదర్శనం చేసే కార్యక్రమంగా దేశ విదేశాలను బయో ఏషియా ఆకర్షిస్తుందన్నారు. బయో ఏషియా-2025 ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలో దిగ్గజన ఫార్మా కంపెనీలు, హెల్త్‌కేర్, లైఫ్ సైన్స్, బయోటెక్ కంపెనీలు హైదరాబాద్‌కు వస్తున్నాయి. ఇక్కడి నుంచి పని చేస్తున్నాయి. కొత్త ఆవిష్కరణలను అందించే సంస్థలను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇప్పటివరకూ ఉన్నత విద్యపై పెట్టుబడులు పెట్టాం. జీనోమ్ వ్యాలీని ఏర్పాటు చేసుకున్నాం. ఎందరో శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, ఇంజనీర్ల సమూహాన్నీ తయారు చేశాం. మొదటి నుంచి పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను అందించే సంస్థలను ప్రోత్సహించాల నే దార్శనికతతో మా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. తాము ఇంతకాలం ఉన్నత విద్యపై దృష్టి పెట్టామన్నారు. ఎందరో శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, ఆయా రంగాల్లో నిపుణులు, ఇంజనీర్ల సమూహాన్నీ తయారు చేశామన్నారు. అందుకు తగ్గట్టుగానే జీనోమ్ వ్యాలీని ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు.సులభమైన పారిశ్రామిక విధానం, మౌలిక సదుపాయాలు, ఆశించినంత మద్దతు అందించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ఏడాది లైఫ్ సైన్సెస్ సెక్టార్‌లో దాదాపు రూ.40,000 కోట్లకు పైగా పెట్టుబడులను విజయవంతంగా ఆకర్షించామ న్నారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ కింద గ్రీన్ ఫార్మా సిటీ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు.

అతిపెద్ద తయారీ కేంద్రాలలో ఒకటిగా హైదరాబాద్‌ను నెలకొల్పుతామన్నారు. చైనా ప్లస్ వన్ అవసరాలు తీర్చే కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రపంచం నలుమూలల నుంచి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. అతిపెద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు జరిగాయన్నారు.జర్మన్ కంపెనీ మిల్టెని బయోటెక్ జీనోమ్ వ్యాలీలో తన సెల్, జన్యు చికిత్సను ప్రారంభించిందన్నారు. ఈ వేదికపై మరో నాలుగు బహుళజాతి కంపెనీలను మా పర్యావరణ వ్యవస్థలోకి స్వాగతిస్తున్నామని తెలిపారు. గడిచిన 25 ఏళ్లగా హైదరాబాద్ ఫార్మా తయారీ, ఐటీ, డిజిటల్ హెల్త్ పవర్ హౌస్‌గా పేరు నిలుపుకుందన్నారు .హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ, ౦ఎ సిటీతోపాటు ఎన్నో భారీ ప్రాజెక్టులు చేపడుతున్నట్లు చెప్పుకొచ్చారు. దేశంలో హైదరాబాద్ ఎలక్ట్రిక్ వాహనాల రాజధానిగా అవతరించిందన్నారు. దేశంలో అత్యధిక ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు సాగుతున్నాయని, 3,000 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీలో ప్రవేశపెడుతున్నామన్నారుకోర్ సిటీ వెలుపల ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు మాన్యుఫాక్షరింగ్ హబ్‌ను అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ రెండింటిని రేడియల్ రోడ్లతో అనుసంధానిస్తామన్నారు. ఈ రహదారులకు ఇరువైపులా క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. డ్రై పోర్టును అభివృద్ధి చేసి ఇక్కడి నుంచి ఏపీలోని సీ పోర్ట్‌కు అనుసంధానం ఉండేలా రైలు, రోడ్డు రవాణా సదుపాయాలు మెరుగుపరుస్తామన్నారు.రాబోయే 10 ఏళ్లలో తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. హైదరాబాద్ ఎలక్ట్రిక్ వాహనాల రాజధానిగా అవతరించింది. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ, ౦ఎ సిటీ తో పాటు మరెన్నో భారీ ప్రాజెక్టులు చేపడుతున్నాం. ఇక్కడ దేశంలోనే అత్యధిక ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు జరుగుతున్నాయి. 3,000 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీలో తెస్తున్నాం. హైదరాబాద్ కోర్ అర్బన్ సిటీ ఏరియా సేవల రంగానికి ప్రాధాన్యమిస్తాం. కోర్ సిటీ బయట హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు మాన్యుఫాక్షరింగ్ హబ్ ను అభివృద్ధి చేస్తాం. ప్రపంచంలోని అతిపెద్ద తయారీ కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దుతాం. చైనా ప్లస్ వన్ అవసరాలు తీర్చే కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. ప్రపంచం వ్యాప్తంగా పెట్టుబడులను ఆహ్వానిస్తాం. ఔటర్ రింగ్ రోడ్డు.. రీజనల్ రింగ్ రోడ్డులను రేడియల్ రోడ్లతో అనుసంధానిస్తాం. వీటికి ఇరువైపులా క్లస్టర్లను అభివృద్ధి చేస్తాం. తెలంగాణ భూ పరివేష్టిత రాష్ట్రం కనుక ఒక మెగా డ్రై పోర్టును అభివృద్ధి చేసి.. ఇక్కడి నుంచి ఏపీలోని సీ పోర్ట్ కు అనుసంధానానికి ప్రత్యేక రైలు, రోడ్డు రవాణా ఏర్పాటు చేస్తాం. బయోసైన్సెస్, బయోటెక్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచానికి చిరునామాగా హైదరాబాద్ ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా ఎంచుకున్నాం. అమ్జెన్ సంస్థ నిన్ననే హైదరాబాద్ లో తమ కార్యకలాపాలను విస్తరించింది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉంది. ఇక్కడ అత్యల్ప ద్రవ్యోల్బణంతో పాటు అత్యధిక ఉద్యోగాల కల్పన ఉంది. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు ద్వారా తెలంగాణ ప్రభుత్వం రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. పల రంగాల్లో 50 వేల ఉద్యోగాలు రానున్నాయి. గత ఏడాది లైఫ్ సైన్సెస్ రంగంలో 40,000 కోట్ల పైగా పెట్టుబడులు వచ్చాయి. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ఫార్మా విలేజీలు అభివృద్ధి చేస్తున్నాం. ఐదు లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు రానున్నాయి.

**గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధి**

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ కింద గ్రీన్ ఫార్మా సిటీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. అతిపెద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీలు ఒప్పందాలపై సంతకం చేశాయి. జర్మన్ కంపెనీ మిల్టెని బయోటెక్ జీనోమ్ వ్యాలీలో తన సెల్ అండ్ జన్యు చికిత్సను ప్రారంభించింది. గత 25 ఏళ్లలో హైదరాబాద్ ఐటీ, ఫార్మా తయారీ, డిజిటల్ హెల్త్ పవర్ హౌస్‌గా పేరు నిలుపుకుంది. గత ఏడాది ౦ఎ హెల్త్‌కేర్ సమ్మిట్ నిర్వహించాము. హాజరైన వారికి అభినందనలు. జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును పొందిన ప్రొఫెసర్ పాట్రిక్ టాన్‌కు అభినందనలు' తెలిపారు సీఎం రేవంత్ రెడ్డి.

# ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి,ని భారీ మెజార్టీతో గెలిపించండి...

**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీజారిటీతో గెలిపించాలని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, పట్టపద్రులకి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జమ్మికుంట లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులకు ట్యూషన్ చెప్పుకునే స్థాయి నుండి విద్యా వ్యవస్థ స్థాపించి అనేకమంది విద్యార్థులను ప్రయోజకులను చేసి ఉన్నత స్థాయిలో నిలబెట్టడంలో నరేందర్ రెడ్డి కృషి చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇచ్చిన అనేక హామీలను ఒకటిగా ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే దిశగా అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందని రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసి పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుందని, గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా ప్రజలను మభ్యపెట్టి 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరణ చేస్తుందని త్వరలోనే ప్రతి ఒక్క కుటుంబానికి కొత్త రేషన్ కార్డు మంజూరు చేస్తుందని అన్నారు. దేశంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎలక్షన్ లప్పుడు మాత్రమే తెలంగాణలో హడావిడి చేస్తుంది తప్ప పేదలకు బిజెపి ప్రభుత్వం చేసింది ఏం లేదని అన్నారు. తెలంగాణలో బిజెపికి ఉనికి ఏమాత్రం లేదని ఎమ్మెల్సీ ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నరేందర్ రెడ్డి,కి పట్టభద్రులు మేధావులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్, పుల్లూరి స్వప్న- సదానందం పట్టభద్రులను కోరారు.

# కేసీఆర్ వ్యాఖ్యాలు వెనక్కి తీసుకోవాలి

**మేడ్చల్: పెన్ పవర్:**మాజీ సీఎం కేసీఆర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి కందికంటి అశోక్ కుమార్ అన్నారు.మంగళవారం ఉప్పల్ లోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నేతలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కూటమి జతకట్టి తెలంగాణ కు వస్తాడు అని అంటూ తెలంగాణ ప్రజలను మరోసారి కేసీఆర్ మోసం చేసే ప్రయత్నం చేసి తెలంగాణ లో మరోసారి తెలంగాణ సెంటిమెంట్ రగల్చాలని చూస్తున్నాడు.దీన్ని తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితి లో లేరు.తెలంగాణ సెంటిమెంట్ ను ఉపయోగించి ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రం గా చేసిన ఘనత కేసీఆర్ ది అని ఎద్దేవా చేశారు.కుటుంబ పాలనతో వారి కుటుంబ సభ్యులు తెలంగాణ కు 7 లక్షల కోట్ల అప్పులు మిగిల్చారని అన్నారు.కేసీఆర్ ఎన్ని మాయ మాటలు చెప్పిన ప్రజలు నమ్మే పరిస్థితి లో లేరు. కచ్చితంగా వచ్చే మున్సిపల్ ఎన్నికలలో,స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రతి డివిజన్ నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పోటీలో ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా ప్రతి నాయకుడు కృషి చేస్తాడని అన్నారు.

# పోలీసు వాహనం బోల్తా.. నలుగురికి గాయాలు



**సంగారెడ్డి: పెన్ పవర్:**పటాన్చెరు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 3 వద్ద పోలీసు వాహనం బోల్తా పడింది. పోలీస్ వాహనంలో ఉన్న నలుగురు సిబ్బందికి తీవ్ర గాయాలు అయ్యాయి. టైరు బ్లాస్ట్ కావడంతో వాహనం బోల్తా పడింది. వాహనం సైబరాబాద్ కమిషనరేట్ చెందింది. సైబరాబాద్ కమిషనరేట్ నుండి సంగారెడ్డి జైలుకు వెళ్తుండగా ఘటన జరిగింది.

# కల్పవృక్ష వాహనంపై శ్రీ కపిలేశ్వరస్వామి కనువిందు

**తిరుపతి, 2025 ఫిబ్రవరి 25 పెన్ పవర్:**తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన మంగళవారం ఉదయం 7 గంటలకు శ్రీ కపిలేశ్వరస్వామి వారు కల్పవృక్ష వాహనంపై భక్తులకు అభయమిచ్చారు.భజనమండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. వాహనసేవ ఆలయం నుండి మొదలై కపిలతీర్థం రోడ్, అన్నారావు సర్కిల్, వినాయక నగర్ క్వార్టర్స్, హరేరామ హరేకృష్ణ గుడి, ఎన్‌జిఓ కాలనీ, అలిపిరి బైపాస్ రోడ్ మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం అర్చకులు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ సోమస్కందమూర్తి, శ్రీ కామాక్షి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో అభిషేకం చేశారు.

# జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశం




**జయశంకర్ భూపాలపల్లి, పెన్ పవర్:**న్యాయవాదులు, బ్యాంకు మరియు ఇన్సూరెన్సు కంపెనీల మేనేజర్లు, ఆర్ టి సి సూపరింటెండెంట్ లతో నేషనల్ లోక్ అదాలత్ సమన్వయ సమావేశం మంగళవారం జరిగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ & సెషన్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి. నారాయణ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలనీ, సమన్వయము తో పని చేయాలని సూచించారు. లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించుకుంటే కలిగే లాభాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. బ్యాంకులు, ఇన్సూరెన్సు కంపెనీలు, ఆర్ టి సి లో పెండింగ్లో ఉన్నటువంటి ప్రీ లిటిగేషన్ కేసులను లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవాలని జడ్జి గారు సూచించారు. మార్చ్ 8 న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో అందరూ పాల్గొని పెద్ద ఎత్తున కేసుల పరిష్కారం చేసుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే. జయరాం రెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. రామచంద్రా రావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మెరుగు రవీందర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జి. ప్రియాంక, న్యాయవాదులు వేషాల రవీందర్, సంగేమ్ రవీందర్, రజినీకాంత్, ఇందరపు శివకుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, ఎస్ బి ఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఐ సి ఐ సి ఐ, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్లు, టి జి ఎస్ ఆర్ టి సి బస్సు డిపో సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ లో మంత్రి పొన్నం ప్రచారం

**కరీంనగర్: పెన్ పవర్:**పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీ చైతన్య స్కూల్ లో తిమ్మాపూర్ లో ఉపాధ్యాయులతో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ,మంత్రి పొన్నం ప్రభాకర్ ముచ్చటించారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం తర్వాత కూడా మీ అందరి ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వం గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. రైతులకు రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేసాం సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ ఇచ్చాం. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 కి గ్యాస్ అందిస్తున్నాం. ప్రతి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. చదువుకున్న మేధావులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడాలి. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నరేందర్ రెడ్డి విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. అంజిరెడ్డి మన కరీంనగర్ కు సంబంధం లేని వ్యక్తి. అందరూ స్థానిక నేతలే. కాంగ్రెస్ పార్టీ బలరిచిన అభ్యర్థి నరేందర్ రెడ్డి సీరియల్ నెంబర్ 2 ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు.

# మాది ఇండియా టీం....కాంగ్రెస్ ది పాకిస్తాన్ టీం



**కరీంనగర్ పెన్ పవర్:**
మొన్న జరిగిన ఇండియా పాకిస్తాన్ ఛాంపియన్ ట్రోఫీ మ్యాచ్ లో ఇండియా గెలిచింది. బీజేపీది ఇండియా జట్టు. పాకిస్తాన్ గెలిస్తే సంబురాలు చేసుకునే ఎంఐఎంతో అంటకాగుతున్న కాంగ్రెస్ ది పాకిస్తాన్ జట్టు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల మ్యాచ్ లోనూ గెలుపు బీజేపీదే. పాకిస్తాన్ ను చిత్తు చేసి తీరుతాం" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ 14 నెలల పాలన బాగుందని విర్రవీగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగా తీసుకునేందుకు సిద్దమా? అని సవాల్ విసిరారు. తెలంగాణసహా ఏ గ్రామానికి, ఏ మున్సిపాలిటీ, కార్పొరేషన్ కు కేంద్రం ఎన్ని నిధులిచ్చింది? రాష్ట్రం ఎంత ఖర్చు చేసిందనే వివరాలపై లెక్కా పత్రంతో సహా బహిరంగంగా చర్చించేందుకు సిద్దమని సవాల్ విసిరారు. తాము గతంలోనే సవాల్ చేస్తే సీఎం తోకముడిచిన విషయాన్ని గుర్తు చేశారు.

ఈరోజు ఉదయం కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల శంకర్, కాటేపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్పలతో కలిసి బండి సంజయ్ మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఫోన్ ట్యాపింగ్ కేసుపై హైకోర్టులో పిటిషన్ వేసి సీబీఐ విచారణ జరిపించాలని కోరితే ప్రభుత్వం ఒప్పుకోని విషయం నిజం కాదా?. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాతే ప్రభాకర్ రావు, శ్రవణ్ విదేశాలకు పారిపోయారు. మీరు వాళ్లను అరెస్ట్ చేయకుండా పారిపోయేలా చేసిందే కాంగ్రెస్. మీరు విదేశాలకు పంపిస్తే...మేం పట్టుకురావాలా? కేసీఆర్ చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశామని పోలీసులు చెప్పిన తరువాత కూడా ఆయనకు కనీసం నోటీసు కూడా ఎందుకియ్యలే?.

నన్ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుండి తప్పించి బీసీలకు అన్యాయం చేశారనడం అబద్దం. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, కేంద్ర మంత్రిగా ప్రమోషన్ ఇచ్చింది.కాంగ్రెస్ పాలన బాగుందని విర్రవీగుతున్న సీఎంకు సవాల్ చేస్తున్నా...మీ 14 నెలల పాలనపై ఎమ్మెల్సీ ఎన్నికలే రెఫరెండంగా తీసుకుందామా అని సవాల్ విసిరారు.

# 10వ తరగతి పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలి.



**జయశంకర్ భూపాలపల్లి,పెన్ పవర్:**
10వ తరగతి పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ఆదేశించారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఛాంబర్ లో 10వ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహణపై విద్యా, విద్యుత్, వైద్య, ఆర్టీసీ, తదితర శాఖల అధికారు లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 21 నుండి ఏప్రిల్ 4 వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతాయని వివరించారు. పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు పరీక్ష సమయాలకు అనుగుణంగా రవాణా సదుపాయం కల్పనకు బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్ కో ఎస్.ఈకి సూచించారు. ఎలాంటి లోటుపాట్లను తావులేకుండా పరీక్షలను సజావుగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి సౌకర్యం కల్పించాలని, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారి కి సూచించారు.

కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించి, కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు.

ఈ సమావేశంలో డీఈఓ రాజేందర్, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, కలెక్ట రేట్ ఏవో ఖాజా మొహినుద్దీన్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.